సిద్ధిపురి కథలు

# పండుగ కట్నం

-ఐతా చంద్రయ్య

"రాత్రి ఎనిమిదైందండీ! మొదటిది చేదు పండుగట. కొత్తల్లుడు అత్తారింటికెళ్ళొద్దంటే వినకుండా లాక్కొచ్చారు..." టీ తాగుతూ గ:మధుమలాడింది మాధురి. ఫ్యాన్ గాలి ముంగురుల్ని చెక్కిళ్ళ మీదాడిస్తుంది. ట్యూబులైటు వెలుగు ముక్కుపుడకలో తళుక్కుమని నగేష్ కళ్ళల్లో మెరిసింది, నగేష్ ఎదలో గిలిగింతలు.

"చిరు కోపంతో నీ మొహం చందమామైందోయ్!" కప్పు టేబుల్ మీదుంచి పెదాలందుకో బోయాడు. ఎడమచేత్తో భర్తనడ్డుకుంటూ "ఇది పడగ్గది కాదు మహానుభావా! సిద్ధిపేటలో అమరావతి హోటల్ ప్రభూ!" సిగ్గులు అలికేసింది.

కొత్తగా పెళ్ళైన జంటది. తెల్లవారితే ఉగాది. పండగ కట్నం దండిగా దండుకోవాలని వచ్చేశాడు నగేష్. బస్టాండ్‌లోనే టీ తాగాలన్పించింది.

"ఇది ఫ్యామిలీ రూం డియర్. ఎవ్వరూ లేరు. ఆ గులాబి బుగ్గ...అబ్బా...ప్లీజ్ మాధురీ!" మాధురి కనురెప్పలు వాలిపోతున్నై. ఏదో పారవశ్యం.

భార్యా, ఇద్దరు పిల్లల్తో అప్పుడే దిగాడు భగవంతం.

"ఛీ...పానకంలో పుడక.." గొణుక్కున్నాడు నగేష్.

"నగేష్! ఎప్పుడొచ్చారు బ్రదర్!" తోడల్లుడు అమెరికాలో ఆంధ్రుడిలా కన్పించాడు భగవంతంకు.

"అక్కా! మీరుకూడా వచ్చారా!" మాలతిని పిలిచి పక్కన కూచోబెట్టుకుంది మాధురి. టేబుల్‌కో పక్క అక్కా చెల్లెళ్ళు, మరోపక్క తోడల్లుళ్ళు పిల్లలు మరో పక్క కూచున్నారు.

"చెప్పు బ్రదర్! ఈ పండక్కి మనకేం కట్నాలు పెడతారంటావ్!" టీకి ఆర్డరిచ్చి అడిగాడు భగవంతం.

"మొదటిది చేదు పండగనే ఛాందసాన్ని ఛేదించి మరీ వచ్చశామన్న గారూ! స్కూటర్ వసూలు చేస్తా!"

"నేనైతే మామగారు రావద్దని రాసినా, మీ వదిన వద్దని మొత్తుకున్నా ఖాతరు చెయ్యలేదు. పాతల్లుణ్ణి గదా! ఓ పోర్టబుల్ టీ.వి. వసూలు చేస్తా!"

ఇద్దరిలో పట్టుదల పొంగి పొర్లింది. అక్కా చెల్లెళ్ళు వారి మాటల్లో పడిపోయారు.

"మన బామ్మర్దికి కమర్షియల్ టాక్స్‌లో ఉద్యోగం దొరికిందట. సూర్యాపేటలో తెగ సంపాదిస్తున్నాడంట, మనం మాత్రం పరస్పరం మద్దతిచ్చుకోవాలి సుమా!" నగేష్ గల్లా ఎగిరి పడింది.



వీడికి ఆలిండియా అల్లుళ్ళ సంఘాధ్యక్షుడయ్యే అర్హతలున్నాయి - అనుకున్నాడు భగవంతం.

ఆటోల్లో బయల్దేరారు. పిల్లలు కొత్త జంట వెంటున్నారు.

"ఇంటికెళ్ళగానే మా తమ్మునికో సర్ప్రైజిచ్చి, భోంచేసి పడుకోవాలండీ!" అలసటగా భర్త మిది కొరిగింది మాలతి. బుగ్గ గిల్లాడు భగవంతం. దిగ్గున పక్కకు జరిగి వెక్కిరించింది. సిగ్గులేదూ!" అన్నట్టుగా.

ప్రశాంతి నగర్లో ఇంటి ముందాగాయి ఆటోలు, అరడజను చాక్లెట్లు ఒకేసారి దొరికినట్టు కేరింతలు కొడుతూ దిగారు పిల్లలు, డబ్బులు పుచ్చుకొని వెళ్ళిపోయాయి ఆటోలు. కాలనీ నిర్మానుష్యంగా ఉంది.

"బాబోయ్! అమ్మమ్మింటికి తాళమేసుంది" పాప బుంగమూతి పెట్టేసింది. అంతా చూశారటు. తాళం కప్ప వెక్కిరిస్తూంది. వీధిలైటు విరగబడి నవ్వుతూంది, తట్టగానే పక్కింటి తలుపులు కోపంగా తెరుచుకున్నాయి.

"మా అమ్మా వాళ్ళే రండీ!" మర్యాదగా అడిగింది మాధురి.

"ఓహో! మీరు రామచంద్రాచారి కూతుళ్లా! మీ అమ్మా నాన్నలు మొన్ననే సూర్యాపేట కెళ్ళారు." ఆవులిస్తూ తలుపులు ధడేల్న మూసేసిందా ఇల్లాలు.

"అయ్యో! ఇప్పుడెట్లా!" నగేష్ అరుగు మీద కూచున్నాడు.

"మొండి అల్లుళ్లకు దండి కట్నం దొరికింది" మాలతి నెత్తికొట్టుకుంది.

★

-ఐతా చంద్రయ్య
ఇ.నం.4-4-11, శేర్పూర్
సిద్ధిపేట-502 103.